# మార్పు

కొడుకును కొట్టిన రాములుకు కడుపులోంచి దుఃఖం ఎగిసి ఎగిసి వస్తోంది. ఎంసెట్‌కు ఫీజు కట్టిన కొడుకు శేఖర్ సరిగ్గా చదవడం లేదని బాధ. తనకి అవకాశాలు లేక జీవితం కుదించుకుపోయింది. తన చదువుకోసం అమ్మ ఎన్ని తిప్పలు పడిందో. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన తాను ఎన్ని అవమానాలు భరించాడో.

రాములుకు తన బాల్యం గుర్తుకువస్తోంది. తనకూ తన కొడుక్కూ మధ్య అవకాశాల్లో ఎంత తేడా ఉందో పోల్చి చూస్తున్నాడు. తన కొడుక్కు చదువుకొని ఉద్యోగం చేస్తున్న తండ్రి ఉన్నాడు. నాలాగా తండ్రిలేని లోటులేదు వాడికి. చక్కని సలహా లిచ్చేందుకు తాను వాడికి అందుబాటులో ఉన్నాడు. డ్రెస్సుల విషయంలో గానీ, డబ్బుల విషయంలోగానీ వీడికొచ్చిన కష్టాలేమీ లేవు. తనలా సమాజంలో నిత్యం అవమానాల పాలయ్యే స్థితీ కాదు.

నా కొడుక్కు యిన్ని అవకాశాలున్నాయి. వాడికి కోచింగ్‌కు వెళ్తానంటే పంపించే తండ్రి ఉన్నాడు. వాడికి తండ్రిగా నేను కొనిచ్చిన సైకిలు కూడా ఉంది. ఉన్న అవకాశాల్ని వాడు సద్వినియోగం చేసుకోవడం లేదు. వాడికి యింకా ఎలా నచ్చచెప్పాలి. విద్యార్థి జీవితం బంగారు జీవితం అనీ యీ జీవితం తిరిగిరాదనీ, నీ తండ్రి గౌరవం తండ్రిదేననీ, నీ గౌరవం నీదేననీ, నీ వ్యక్తిత్వం, క్వాలిఫికేషన్సు, హోదా నీవేననీ, దాన్ని బట్టే నిన్ను గౌరవిస్తారనీ ఎన్నని చెప్పాడు.

నీకున్న అవకాశాలు నాకాకాలంలో ఉంటే నేను ఒక లెక్చరరో, యింజనీరో, చక్కని రచయితో అయి వుండేవాడిననీ నా జీవితం అంతా పూటకు గతిలేని బతుకుగానే కొనసాగిందనీ ఎన్నని చెప్పాడు తాను.

నేను పదవ తరగతిలో కూడా ప్యాంట్లు తొడిగి ఎరగను. ఎంతో ఏడ్చి మూడు రోజులు అలిగిపంటే గానీ అమ్మ ఒక కాటన్ ప్యాంటు కుట్టించలేదు. పిర్రల మీద రఫ్ కుట్టించిన నిక్కర్లతోనే నేను విద్యార్థి జీవితం గడిపాను. అమ్మ పాతచీర పీగుల్నే కర్చీఫ్‌లుగా వాడుకునేవాడ్ని. నా చినిగిన నిక్కర్లు చూసి "టాప్పాకానా (పోస్టాఫీసు) కుళ్ళా, గోలకొండ ఖిల్లా" అని ఎంత ఏడ్పించేవారో.

ఇంట్లో పిడుకల పొగ, కట్టెల వంటతో తన పుస్తకాలు, బట్టలు అన్నీ పొగపట్టి నల్లబారి పొగవాసన వచ్చేవి. నన్ను కొందరు స్నేహితులు అదోలా చూసేవారు. ఎన్ని కష్టాలు పడ్డాను. పదో తరగతి వరకు కూడా నేను చెప్పులు తొడుక్కొని ఎరుగను. బురదలో కాళ్ళకు ఎన్ని ముండ్లు దిగబడ్డాయో, ఎర్రటి ఎండల్లో అరికాళ్ళు మంటలు లేస్తుంటే కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగేవి. ఎండకు శరీరం నల్లబడేది. కర్రోడా అని నన్ను ఎంతమంది ఎక్కిరించారో.

పిడుకల కోసం అమ్మ పేడ తీసుకురమ్మంటే నేను రోజూ పొద్దున్నే పశువుల మంద వెంట వెళ్ళేవాన్ని, బర్రె తోక లేస్తే చాలు బర్రెపెండా అంటూ ఉరికి ఆ పెండను కుప్పచేసి దానిచుట్టూ

గుండం గీసి దాన్లో కట్టెపుల్ల చెక్కి రిజర్వు చేసి కొనేవాన్ని.

నాకు పిడుకల్లో కలిపే వరి ఊక కోసం వెళ్ళే రైసుమిల్లు పక్కనున్న ఉనుక గుట్టే గొప్ప గ్రౌండు. అందరం ఎగురుకుంటూ దొమ్మరి గడ్డలు వేసుకుంటూ ఎంత ఆడుకునే వాల్లమో. చెవుల్లో, కళ్ళల్లో ఎంత ఉనుక పడేదో, అమ్మ ఎంత తిట్టేదో, తిట్టితలంటి పోసేది. ఇపుడు వీడో.... వీడు క్రికెట్ ఆడుతాడు. ఫుట్‌బాల్ ఆడుతాడు. క్యారమ్స్ ఆడుతాడు. వీని బట్టలు ఎంత షోకుగా ఉన్నాయి. వీనికి పాలిష్టర్ డ్రెస్సులు. అవీ - ప్యాంటూ, ఫుల్‌షర్టులు, మూడేసి జతలు. ఇంట్లో కరెంటు యిస్త్రీ పెట్టె. వీడు ఎంత చక్కని క్రాపింగ్ కొట్టించుకుంటాడో, తనకైతే అమ్మపావులా, యాభయి పైసలతో కటింగ్ కొట్టించేది. జెల్లి వెంట్రుకలు పెరుగొద్దని అమ్మ దగ్గరుండి మరీ చిన్నవిగా కట్ చేయించేది. అందరు చిప్ప కటింగ్ అని బనాయించి ఏడ్పించేవాళ్ళు. ఇప్పుడు వీనికి ఎన్ని షోకులో.... ఒక్క కటింగ్‌కు సెట్టింగ్‌కు పన్నెండు రూపాయలు ఖర్చు చేస్తున్నాడు.

నేను చిన్నప్పుడు ఎప్పుడైనా చాయ్‌తాగి ఎరుగుదునా? టిఫిన్లు ఎరుగుదునా? వీనికి వాళ్ళమ్మ నిద్రలెవ్వంగనే అన్నీ రెడీ పెడ్తుంది. నాకు చిన్నప్పుడు గంజే చాయ్, టిఫినూ. అన్నం వండితే గంజి వెళ్ళేది. అపుడప్పుడు జొన్న అంబలి చేసేది అమ్మ. గంజిలో అంబలిలో యిన్ని మెతుకులు వేసుకొని తాగితే కడుపు నిండేది. మక్కగడుక (మొక్కజొన్న సంకటి) ఎల్లిపాయ కారంతో నా బాల్యం గడిచింది.

అపుడు యిన్ని గడియారాలెక్కడివి? ఇంటి ముంగటున్న తుమ్మచెట్టు నీడను బట్టిటైమెంతైందో తెల్సుకుని బడికి ఉరికెటోన్ని. నా నీడను కొల్సుకొని టైం తెల్సుకొనేటోన్ని. తుమ్మచెట్టు కింద పాత తుమ్మమొద్దు మీద పాతచీరె పరుచుకొని చదువుకుంటే అదే ఫ్యాను. అదే స్వర్గం అనుకునేవాన్ని.

ఒక్కరోజు సెలవు దొరికితే చాలు అమ్మ వెంట కూలిపనికి పోయేవాన్ని. అమ్మకు పని సాయం కోసం యిల్లు వాకిలి నేనే ఊడ్చి పేడ నీళ్ళతో అలుకు చల్లేదాన్ని. గోడలకు జాజు (రెడాక్సయిడ్ మట్టి)తో తీనెలు తీసి సున్నంతో తీర్చిదిద్దినట్టు బొట్లు పెట్టేవాన్ని.

తెల్లారిలేచి చీమిడి చీదితే నల్లగ కారేది. ఎలకల బాధకు అమ్మ రాత్రంతా గ్యాసు మానె దీపం పెడ్తుండేది. దీపం పొగతో చీమిడి నల్లబడేది. మబ్బుల్నే (వేకువనే) లేచి చెట్లలోకి దొడ్డికి ఉరుకాల్సి వచ్చేది. తెల్లారితే దొడ్డికీ, స్నానానికీ చెరువుకు దారి పట్టాల్సి వచ్చేది. ఆ చెరువు నీళ్ళతో సర్ది (జలుబు) చేసి ఎప్పుడూ తుమ్ములు వస్తుండె చీమిడి కారుతుండె. చీమిడి నాకినవు అని నన్ను దోస్తులు ఎన్నిసార్లు ఏడిపించినారో, వీడు యిపుడు యిలాంటి కష్టాలేమైనా పడుతున్నాడా?

ఇప్పుడు వీనికేంది? కమ్మని సబ్బులు, నల్లానీళ్ళ స్నానం, ఇంట్లోనే లెట్రిన్, బాత్‌రూమ్, వీని బట్టలు కూడా వాళ్ళమ్మనే ఉతుకుతుంది. వీడు యింట్లో ఫ్యాను కింద, ట్యూబ్‌లైటు వెలుగులో షాబాతు(నాప) రాళ్ళు పరిచిన యింటిలో కుర్చీలో కూర్చుని ఎంతో హాయిగా చదువుకోవచ్చు.

నేను చిన్ననాడు కుర్చీలో కూర్చుని ఎరుగుదునా! మట్టితో అలికిన యిల్లు ఒలికిపోయే నీళ్ళతో, వర్షానికి ఉరిసిన ఉరుపుల్తో గుంతలు గుంతలుండేది. గ్యాసు నూనె బుడ్డిదీపం ముందు కూర్చుని చదువుకునేందుకు సమతలమైన స్థలమే కనపడేది కాదు.

నేను చిన్నప్పుడు చేసిన పనుల్లో వీడు ఏపాటి చేస్తున్నాడు. నేను తెల్లారి లేచి నీళ్ళు చేది కుండలన్నీ నింపేవాన్ని, గిన్నెలన్నీ తోమి కడిగేవాన్ని, పక్కింటి నుంచి పిడుక మీద అగ్గినిపుక తెచ్చి ఉప్పు ఉప్పు ఊది పొయ్యి అంటించేవాన్ని. గొట్టంతో ఊది ఊది పొగతో కళ్ళు మంటలు మండేవి. ఇపుడు వీళ్ళ అమ్మే అన్ని పనులు చేసికొంటుంది. నా కొడుకు మంచిగ చదువుకోవాలె అని మరీ గారాబం చేస్తుంది. ఏ పనీ చెప్పదు. ఇంటి పనులు చిన్నపుడూ నేనే చేశాను. ఇపుడూ నేనే చేస్తున్నాను. వీడు యింత సుఖంగా పెరుగుతున్నాడు.

అసలు వీడు ఎంత సుఖంగా పెరుగుతున్నాడో వీనికేమైనా తెల్సునా? మా కాలంలో మేం

ఎన్ని కష్టాలనుభవించి యిట్లా ఎదిగామో వీనికేమైనా అర్థమైందా? అర్థమైతే ఏదీ వీని చదువు? ఇంత సుఖపడుకుంటూ యింటర్ ఫస్టియర్లో ఎవరేజీ సెకండు క్లాసు మార్కులు తెచ్చుకుంటాడా? నేను అన్ని పనులుచేసి ఎన్ని మార్కులు తెచ్చుకున్నానో.

వీనికి అసలు చదువు అబ్బుతుందా? ఎపుడు చూసినా వీని దోస్తులు, స్టూడెంటు రాజకీయాలు, తిరుగుళ్ళు, సినిమాలు, ఇంట్లో వుంటే ఎపుడూ టీవీకాన్నే అడ్డా (తిష్ట). నేను యింట్లోకి వస్తున్న అలికిడి దూరం నించే పసిగట్టి పుస్తకం చదువుతున్నట్టు నటిస్తాడు. వీని నటన నాకు తెల్వదనుకుంటున్నాడు.

ఛీ.. పోరగాన్లు ఎట్లయి పోతున్నారు. బాహ్య ఆడంబరాలు ఎక్కువైపోయాయి. అమ్మా నాన్నలు యింత కష్టపడి తమ జీవితాలను ధారపోసి తమను సుఖంగా పెంచుతూ చదివిస్తున్నారని వీళ్ళకేమైనా అర్థమవుతుందా! మాకు వేరే జీవితాశయాలు ఏమున్నాయని! తమ పిల్లలు బాగా పైకి రావాలి అనే తపన తప్ప. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లల భవిష్యత్తు గురించే ఆరాటపడుతారు. తల్లిదండ్రుల హృదయాన్ని ఈ పిల్లలు అర్థం చేసుకొనేదెప్పుడు? వీడు ఎంసెట్ లక్ష్యం పెట్టుకుని "బొంబాయి" సిన్మాకెళ్తాడా? వీడికి చదువు మీద శ్రద్ధ వున్నట్టేనా! మార్కెట్లోకి పోయి కూరగాయలు తెమ్మంటే చాతగాదు గానీ సినిమాలకు షికార్లకు రెడీ. కిరాణా షాపులోంచి సామాను సైకిల్ మీద తేవచ్చుగదా! వీనికి నామోషీ అట - రిక్షాలో వేయించుకుని తెస్తాడు. ఎట్లా తయారైనారు పోరగాన్లు.

మనం ఎట్లా పుట్టినం, మన తాతలు తండ్రులు ఎంత కష్టపడ్డారు. రాకరాక వచ్చిన యీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి గదా! ఇదంతా వీడేమైనా ఆలోచిస్తున్నాడా? వేల ఏండ్ల నికృష్ట బానిస జీవితాల తరువాత యీ జీవితం లభించింది. తమకేమైనా తాతలు తండ్రులు సంపాయించిన భూములున్నాయా? ఆస్తులున్నాయా? ఈ ఉద్యోగం - ఈ చదువు మీద ఆధారపడే బతకాలి. లేదా రెక్కల కష్టం చేసుకోవాలి. ఇతర కులాల వాళ్ళలాగా అటు ఆస్తికి ఆస్తీ ఇటు ఉద్యోగానికి ఉద్యోగం, యిల్లు కిరాయిలో, పొలం మీది పంటో, బిజినెస్‌లో పార్టనర్‌షిప్పో, షేర్‌లల్లో లాభాలు వంటి రెండు రకాల సంపాదనలు తమకేమైనా వున్నాయా! అలాంటి వాళ్ళకు ఉద్యోగం ఒక హాబీ, ఒక హోదా చిహ్నం! కాని తనకో! ఇది లేని జీవితం ఊహించగలడా? యూనియన్లలో వాళ్ళలా తిరగడానికి తనకు ముందూవెనకా ఎవరున్నారని? వాళ్ళకేంది - తాతలు తండ్రుల ఆస్తిపాస్తులు, సంఘంలో గౌరవం, పరపతి వంటివెన్నో వున్నాయి. వాళ్ళ చుట్టాలు పక్కాల్లో ఎంతో మంది పెద్ద పెద్ద ఉద్యోగులున్నారు. అధికారులున్నారు. నాయకులున్నారు. బిజినెస్‌దార్లున్నారు. ఏదైనా జరిగితే ఆదుకోవడానికి వారికి వాళ్ళంతా వున్నారు. తనకు సరే! తన కొడుక్కు ఏరీ! నా కొడుకు వాళ్ళ పిల్లల దోస్తానీ చేస్తూ వీడు వాళ్ళతో సమానం అనుకుంటూ యేగి(వృధాగా) తిరిగితే మనకు ముందూ వెనకా ఎవరున్నారు. ఇలాంటివన్నీ కొడుక్కు చెప్పాలంటే సంకోచం. అలా చేస్తే మనను మనం కించపరుచు కున్నట్టవుతుందని భయం ఓ పక్క. ఇవన్నీ చెప్పి కొడుక్కులేని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును నూరిపోసి తమ కులం, తమ ఖాన్‌దాన్ (వంశ ప్రతిష్ట) తక్కువ అని చెప్పి ఇపుడున్న ఆత్మ విశ్వాసాన్ని చెడగొట్టాలా! అలా చేసి చిన్నప్పటి నుంచి తాను అనుభవిస్తున్న మానసిక హింసను, అభద్రతా భయాన్ని, అవమానాన్ని, కొడుక్కూ అంటించాలా! ఈ సమస్యను ఎట్లా పరిష్కరించుకోవాలి. వీని దోస్తుల్లాంటి జీవితం మనది కాదనీ మనం బాగా కష్టపడి చదివి పైకొస్తేనే ఎవరైనా గౌరవించేదనీ అదేదీ లేకపోతే తక్కువ కులపువాళ్ళు అంటూ మనను చిన్న చూపు చూస్తారనీ వీని మనసు గాయపడకుండా అర్థం చేయించడం ఎలా?

వీడు బాగా చదువుకొని పైకొస్తే వీడేగదా అనుభవించేది. ఇతరులకేమైనా పెడ్తాడనా? ఈ చాలీ చాలని జీతంలో తాను మాత్రం ఎవరికి పెడ్తున్నాడని? నా కొడుకు డాక్టరయ్యాడు-ఇంజనీరయ్యాడు అనే సంతోషం తప్ప తనకు మిగిలేదేముంది? ఆ వచ్చిన కోడలు మా ముసలితనంలో మమ్ముల్ని

అరుసుకుంటుందని (సేవ చేస్తుందని) గ్యారంటీ ఏమిటి? ఈ కాలపు చదువుకున్న ఆడపిల్లలు అత్తమామలకు సేవ చేస్తారా! ఉద్యోగం మీద పోతే వాళ్ళెక్కడో, మేమెక్కడో. ఈ యిల్లు వదిలేసి కొడుకు కోడలు వెంట తిరగడం సాధ్యమా?

ఎన్నాళ్ళ కలలపంట యీ యిల్లు. ఎన్ని అనుభూతులు, అనుభవాలు యీ యిల్లుతో పెనవేసికొని వున్నాయి. ఈ యిల్లు నిలబెట్టుకోవడం కోసం ఎన్ని కష్టాలు అనుభవించాము. ఈ యింట్లో వుంటే తమకు ఎంత తృప్తి - ఎంత ఆత్మవిశ్వాసం. ఇది నా యిల్లు - నా సంసారం అనే ఆత్మ విశ్వాసం ప్రపంచాన్ని జయించే ధైర్యాన్నిస్తుంది. ఇంత గొప్ప ఇల్లును వదిలేసి కొడుకు కోడలు వెంట ఊరూర తిరగడం సాధ్యమా! ఏదో ఆ యింత వచ్చే పెన్షనుతో యిదే ఊళ్ళో అదే గడిచిపోతుంది. కాళ్ళు రెక్కలు ఆడినంత కాలం. అటు వెనుక ఎలా వుంటుందో ఏమో. ఎవరు చూడవచ్చారు. ఆస్తి పాస్తులు, కొడుకులు, బిడ్డలు, మనుషులు, మనుమరాండ్రు అందరూ సుఖంగా వుండి దిక్కులేని చావు ఎంతమంది చావలేదని.

కొడుకును కొట్టాడన్న మాటేగానీ కొడుకుకన్నా ఎక్కువ బాధపడిపోతున్నాడు రాములు. ఈ ఆవేదనే కోపంగా మారి కొట్టినట్టున్నాడు. గతమంతా గుర్తొచ్చి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. నేనందుకున్న ఈ అభివృద్ధి నా కొడుక్కు అందకుండా రోడ్డునపడితే నా యీ అభివృద్ధికి అర్థం ఏమిటి? ఎవరికోసం యీ బతుకు, కళ్ళనీళ్ళు తుడుచుకొని మళ్ళీ అంతలోనే గంభీరమైపోయాడు రాములు. మొహం సబ్బుతో రుద్దుకుని తయారై బయటికి నడిచాడు.

సూటిగా రాజయ్య యింటికి వెళ్ళాడు. తన బాధను వెళ్ళబోసుకున్నాడు. రాజయ్య టీచరు. టీచర్స్ ఫెడరేషన్లో చురుకుగా పనిచేస్తాడు. కొంతకాలం పౌరహక్కుల సంఘంలో పనిచేసి చేయి కాల్చుకున్నాడు. రాములూ రాజయ్యా చిన్ననాటి స్నేహితులు.

రాజయ్య రాములును అనునయిస్తూ మెట్ట వేదాంతం చెప్పుకొచ్చాడు! "ఈ చదువుల వల్ల ఏం ఉపయోగముందిరా? ఈ విద్యావిధానమే అశాస్త్రీయమైంది. దీన్ని చదువుమని బలవంతం చేయడం ఎందుకు? చదివిన వాళ్ళంతా ఏ పాటి బాగుపడ్డారనీ! వాన్ని అనవసరంగా నీ మీద మనస్సు విరిగేటట్టు చేయకు".

ఈ చదువు లేకపోతే తన బతుకంతా శూన్యమే. రాజయ్య బతుకూ అంతే. ఇక ఏం చూసుకొని, ఏం చేసికొని బతికితే తాము ఈ స్థాయికి రావడం సాధ్యం. పది ఎకరాల ఆసామి ఒక అటెండరు స్థాయిలోనైనా బతుకుతున్నాడా! పొలం వుండంగనే సరా! ఎంత పెట్టుబడి కావాలె. ఎందరు సహకరించాలె. ప్రకృతి సహకారం లేకపోతే చేసిన కష్టం అంతా గంగపాలే. ఇవన్నీ వీనికి తెలియదా? వీడు ఏం చూసుకొని ఇట్లా మాట్లాడుతుంటాడో తనకిప్పటికి అర్థం కాదు. ఈ చదువు వద్దంటే తిరిగి మన బతుకును బానిస బతుకు నుంచి ప్రారంభించాలని కోరుకుంటున్నామని వీనికేమైనా అర్థమవుతున్నదా! ఎన్నిసార్లు చెప్పినా వీడు ఇదే పాట. చిన్నప్పుడు రైతులూ, భూసాములూ నన్ను ఇదే అన్నారు. ఎపుడు చదువు మానేస్తే అపుడు కూలి చేయించుకోవచ్చుననుకున్నారు. ఇపుడు విప్లవం పేరుతోటి వీడూ అదే సోది చెప్తుంటాడు. రాములుకు కోపం వచ్చిన మాట నిజం. అయినా తమాయించుకొని మర్యాదగానే ప్రశ్నించాడు.

"అరే! నువ్వు ఎన్ని చెప్పురా! చదువుకున్నోడు - చదువుకోనోడు ఇద్దరు ఒకటి ఎట్లా అవుతారు? నేను, నువ్వు చదువుకున్నాం గనక మనం ఇట్లా బతుకగలుగుతున్నాం. మా తమ్ముడు పదో తరగతి నాలుగుసార్లు ఫేలయి చాలించుకుంటే - ఏమైందిపుడు. ఎట్లా బతుకుతున్నడో చూస్తలేవ? నిజంగనే [illegible] ఏం లేకపోతే ఆస్తిపాస్తులున్నోళ్ళు అవి అమ్ముకుంట లక్షలక్షలు ఖర్చుపెట్టి ఎందుకు

చదివిస్తున్నారంటావు? మల్లా సంపాయించు కోవచ్చునని గాదా! ఈ చదువు లేకపోతే మనకీ తెలివి, ఈ ఉద్యోగాలు, ఇంత మంచి జీవితాలు మాత్రం ఎక్కడివి? మన దేశంలో వున్న పద్దెంది కోట్ల మధ్యతరగతిలాగా మనం బతికే అవకాశం ఏర్పడింది ఈ చదువు వల్ల కాదా! మనలో చదువు లేనివాళ్ళు ఎంతమంది మన తీరు బతుకుతున్నారు అధవా బతుకుతున్నా మనకున్నంత తెలివీ సంస్కారం వాళ్లకున్నదంటవా?"

ఏది తెలివి. ఏది సంస్కారం? ఓటు హక్కు వచ్చిన కొడుకును కొట్టడం గొప్ప సంస్కారమా అని అడుగుదామని రాజయ్యకు కోపం వచ్చిందిగాని తమాయించుకున్నాడు. తమ మధ్య ఈ చర్చ ఎన్నడూ పరిష్కారం కాలేదు. ఎన్నిసార్లు చేశారో ఈ చర్చ. ఎందర్ని ఒప్పించినా వీన్ని ఒప్పించడం తన తరం కాలేదు, అనుకొని అన్నాడు రాజయ్య.

"నువ్వన్నది నిజమేరా! కాని వాన్ని హింస పెట్టి చదువుకొమ్మంటే చదువుకుంటా డంటావా? వానిది వానికి తోచాలెగని".

రాజయ్య స్వేచ్ఛావాదం మీద కూడా రాములుకు అసహనం ఎక్కువ. స్వేచ్ఛ వుండాలి అని ఇద్దరూ అంగీకరించినా ఏది స్వేచ్ఛ అనే మాటమీద ఎపుడూ పేచీయే. యేగి తిరగడానికి స్వేచ్ఛనా? ఎదగడానికి స్వేచ్ఛనా? వాదించడం మొదలెట్టాడు రాములు.

"ఆసక్తికరమైన వాతావరణం లేకుండా ఆసక్తి ఎలా పుడుతుంది? నయాన్నో భయాన్నో చదివించడం తప్పెట్లా అవుతుంది. ఇపుడీ సమాజం వానిది వానికి తోచే టైంనుగానీ, స్వేచ్ఛనుగానీ ఇస్తున్నదంటావా!"

"నిబంధిత అభ్యసనం వేరు, నిర్బంధిత అభ్యసనం వేరు. మొదటిది చదువుకునేట్టు చేస్తుంది. రెండోది చదువుకొమ్మని హింసిస్తుంది. హింస ప్రతిఘటనకు పురికొల్పుతుంది. నువ్వు కొద్తే వాడు నీ మాట వినకుండా, చదువు అంటేనే అసహ్యం కలిగి మొండివాడవుతాడు. నీ బాధను బాధగానే వ్యక్తంచేయి. నీ కొడుకు కూడా నీ ఆవేదనతో కరిగిపోతాడు. ఎంతో ఉత్సాహంగా చదువు కుంటాడు" పిల్లల మనస్తత్వాన్ని విడమరిచి చెప్పాడు రాజయ్య.

"కథలు చెప్పకురా! మనలను మన సార్లు తన్నకుండానే ఇంత చదువు చదువు కున్నామా?" నిలదీశాడు రాములు.

"అప్పటి రోజులు వేరు - ఇప్పటి రోజులు వేరురా! ఆనాడు ఎంత కొట్టినా పడ్డాం. మనను దూలానికి వేలాడదీసినా, తొడపాశం పెట్టినా, చింత బరిగెతో పిర్రలు మట్టలు వాయగొట్టినా పడ్డాం. మన తల్లిదండ్రులు కూడ కొట్టకపోతే చదువెలా వస్తుందనుకున్న రోజులవి. ఈనాడు స్కూల్లల్లో కొడుతున్నారా? కొడితే తల్లిదండ్రులూరుకుంటున్నారా? ఈనాటి పిల్లలు ఎంతో మొండితనంగా కనపడుతారుగానీ వారి హృదయాలు చాలా సున్నితమైనవి. చిన్న మాటకు కూడా చాలా బాధపడిపోతారు. మనను మన తల్లిదండ్రులను చిన్నప్పట్నించి అందరు హింసించి అవమానించడం వల్ల మొండివాళ్ళమైనాం గానీ మన పిల్లలకా పరిస్థితి లేదు. మన కాలంలో ఫేలయినామని ఆత్మహత్యలు చేసికొన్నారా! ఇంత పట్టుదలతో ఇన్ని కోచింగ్ సెంటర్లల్లో చేరి చదివారంటావా? ఎంసెట్‌లో ర్యాంకు కోసం చదివిందే చదవడం, 2, 3 ఏండ్లు వరుసగా అదే చదవడం ఎంత విసుగో నువ్వే ఆలోచించు" ఆవేదనగా అన్నాడు రాజయ్య.

రాములు విసురుగా అందుకున్నాడు.

"నీకేందిర! నీ కొడుక్కు ఎంసెట్లో సీటు వచ్చింది. నీ కడుపు నిండింది. ఇక ఎన్ని కథలైనా చెప్తావులే. నువ్వు పట్టించుకోకపోయినా నీ కొడుకు చదువులో హుశారున్నాడు. నువ్వు మాకు మాత్రం ఇది అశాస్త్రీయ విద్యావిధానం అని మెట్టవేదాంతం చెప్తావు. నీలాంటోళ్ళ బిడ్డలకు నాలాంటోళ్ళ

కొడుకులు ఎక్కడ పోటీ అవుతారనో నీ అక్కసు.''

రాజయ్య మొహం వాడిపోయింది. చాయ్ యిస్తూ రాజయ్య భార్య లలిత నవ్వు కలుగజేసుకుంది. "అన్నయ్యా! నేను వెంటవుండి తగులకపోతే మావోడు మాత్రం ఎంసెట్ల సీ సంపాయించునా ఏందే. ఈయన మాటలకేంది ఎన్నైనా చెప్తడు. ఆరు నెలలు వీని చదువు కో మేం యింట్ల టీవీ పెట్టుకునుడే బందుజేస్తిమి.''

తనకు మద్దతు దొరికినందుకు రాములు సంతోషంతో ఉబ్బిపోయి విజృంభించాడు.

"లలితా! ఇది అశాస్త్రీయ విద్యావిధానం అనే వాళ్ళను అసలు నమ్మవద్దు. వాళ్ళు దొంగ వాళ్ళు బాగా చదువుకొని మిగతావాళ్ళకు ఈ చదువు అక్కరలేదని మెట్టవేదాంతం చెప్తారు పెండ్లయినోడు సుఖంగా పెళ్ళాం చేతివంట తినుకుంటూ పెళ్ళికి తొందరపడే యువకుల్తో సంసార లంపటం వద్దు నాయనా పెండ్లి చేసికొని జీవితం నాశనం చేసికోకు అని నీతులు చెప్పిన ఈ చదువు దేనికి పనికి రావడం లేదట! దేనికైనా ఈ చదువే కావాల్నాయె. ఏం ఈ చదు చదివిన డాక్టర్లు ఇచ్చే ఇంజక్షన్లు పనిచేయడం లేదా? ఈ ఇంజనీర్లు దేనికి పనికిరారా? అయి ఈ టెక్నాలజీ, సైన్స్, అభివృద్ధి అంతా అబద్ధమా? వీడు ఈ సైన్సే అన్‌సైంటిఫిక్ అన్నట్టు తా ఆచరించనిదాన్ని ఇతరులకు ఉపన్యాసాలు దంచుతూ ఎందరి బంగారు భవిష్యత్తును నాశనం చేశా ఇది అశాస్త్రీయ విద్యావిధానం అంటూ విద్యార్థుల్ని చెడగొట్టేవాళ్ళను చెప్పుతో కొట్టాలె. అరేయి! సర్టిఫికేట్లు చింపి అవతల పారేసి కలం పట్టకుండా, నువు చదివిన చదువుతో అది ఇచ్చిన తెలివి సంబంధం లేకుండా నోరు విప్పకుండా వంచిన తల ఎత్తకుండా మా తాత ముత్తాతల తీరు ను నీ కొడుకూ కూతురూ తట్టమోసి బావులు తవ్వి, కూలి పనికిపోయి బానిస జీవితం జీవిస్తే నువ్వు మాట్లాడుతున్నదేమిటో నీకు తెల్సిరాదురా! అపుడు నువు చెప్పే శ్రీరంగనీతులు వింట హు!''

రాములుకు కోపం వస్తే దేన్నీ లెక్కచేయడని రాజయ్యకు తెలుసు. రాజయ్యకు తన బలహీన తన సిద్ధాంతంలోని బలహీనతా తెల్సు. అందుకే లౌక్యంగా ఆవేశపడకుండా తన సిద్ధాంత ధోరణి ప్రారంభించాడు.

"ఆవేశపడకురా! ఈ విద్యకు ఉద్యోగానికి మధ్య సంబంధం ఎక్కడుందో చెప్పు. ఏ లక్షల మంది డిగ్రీ పాసవుతున్నారు. ఎంత మందికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ఏటా లక్ష మ ఎంసెట్ పరీక్ష రాస్తున్నారు. ఎనిమిది తొమ్మిది వేల మందే గదా సీట్లు పొందేది. ఎంత బాగా చది మిగిలిన తొంభయి వేల మందికి ఎంసెట్ సీటు దొరికే అవకాశం లేదు గదా!''

"అట్లా అని ఏ పోటీ పరీక్షలు రాయక ఇంట్లోనే పంటే నీ కొడుక్కు ఎంసెట్లో సీటు వచ్చే పోటీ ఎక్కడ లేదని? నువ్వు అభిమానించే నక్సలైట్లనే తీసుకో. కమ్యూనిస్టులనే తీసుకో. నాయకత నాకే కావాలంటూ కుక్కల తీరు కొట్లాడుకుంటూ ఒకర్నొకరు విప్లవ ద్రోహి అని, రివిజనిస్టు మతి చలించిందనీ తిట్టుకుంటున్నారు. ప్రాణాలు త్యాగం చేస్తున్నామనే వాళ్ళే ఇలా వుంటే ఇ సుఖపడి బతకాలె అనేవారి మధ్య ఆ మాత్రం పోటీ వుండద్దా! పోటీపడి గెలవకపోతే ఎక్కడా దొరకదు. అసలు నువ్వు గతితర్కంలో వైరుధ్యం సూత్రం ద్వారా చెప్పే "ఘర్షణ" పరస్ప నిరాకరించుకొంటూ కల్సివుండే పరస్పర పోటీ కాదా?''

కడుపు చించుకుంటే కాళ్ళమీద పడ్తుంది. వైరుధ్యంలోని ఘర్షణలో వున్న మౌలికాం "పోటీ"యే. తెల్సీ కాదని ఎలా అనగలడు. చర్చ పక్కదారి పట్టకుండా రాజీకి దిగి రాములు ఆలోచి తీరులోకి తన భాషను మార్చుకున్నాడు రాజయ్య.

"నేను పోటీపడవద్దని అనడం లేదురా! నీ కొడుకు ఎంసెట్ రాయవద్దనీ అనడం లే

కాని కొందరికి సీట్లు రావడానికి అందర్ని తెలివితక్కువ వాళ్ళంటూ కించపరిచి వారి ఆత్మవిశ్వాసం హరించడం ఏం సబబు. అలా చేస్తే నువు పోవాలనే కులాల హెచ్చుతగ్గులను వేరే రూపంలో ఆమోదించినట్టు కాదా! కుల వ్యవస్థ పుట్టుకను బట్టి ఉచ్చనీచాలు అంటగడ్తే ఈ పోటీ ప్రపంచం విద్య, ఆస్తి అధికారం హోదా పేరిట అదే పనిచేస్తోంది. అందరూ సమానమే. అందరిని సమానంగా గౌరవించాలి అంటావు గదా! నువ్వనే ప్రతి మనిషికి ఒకే ఓటు, ఒకే విలువను ఆచరించాలా లేదా? అందరూ ఆత్మగౌరవంతో ఆత్మ విశ్వాసంతో బతికే సమాజాన్నే గదా నువ్వైనా నేనైనా కోరుకునేది. అలాంటప్పుడు ఈ పోటీని మరో తీరు నిర్వహించలేమా!"

"అసలు నీ ఉద్దేశం ఏంది?" అడ్డు తగిలాడు రాములు.

అదే చెప్తున్నట్టున్నాడు రాజయ్య. "నా ఉద్దేశం ఏందంటే ఎంసెట్‌లో సీటు రాకపోయినా మునిగిపోయేదేమీ లేదు. డిగ్రీ చదువుకొని అయ్యేయస్‌లు, అయిపియస్‌లు కావడం లేదా! పబ్లిక్ సర్వీస్ కమీషన్ పెట్టే గ్రూప్ వన్, గ్రూపు టు పరీక్షలు పాసై పెద్ద ఉద్యోగాలు సంపాయించడం లేదా? ఎంఫిల్, పబ్లిక్ సెక్టార్‌లో ప్రయివేట్ ఫర్మ్‌ల్లో, రైల్వేల్లో, బ్యాంకుల్లో, నేవీలో, ఏర్‌ఫోర్సులో పెద్ద పెద్ద ఉద్యోగాలు సాధించుకోవడం లేదా? వాళ్ళతో పోలిస్తే డాక్టర్లు, ఇంజనీర్లకున్న స్టేటస్, అధికారం ఏపాటిది? అధవా ఫేలయ్యారనుకో, అయితే ఏం? పది ఫేలయిన మా బావమరిది సౌదీ అరేబియా పోయి మేస్త్రి పనిచేసుకుంటూ నెలకు పదివేలు ఇంటికి పంపడం లేదా? ఎల్.ఎల్.బి. చేసి మా తమ్ముడు అడ్వకేటుగా ప్రాక్టీసు లేక ఈగలు కొట్టుకోవడం లేదా? వాడిపుడు సింగపూర్ పోయి ఏదైనా పని చూసుకుందామని ప్రయత్నాలు చేస్తున్న విషయం నీకు తెలియదా? ఇంటర్‌తో ఆపేసిన శ్రీను - అదేరా మన క్లాసుమేటు రాజేశం ఫోటోగ్రాఫర్ కొడుకు - టి.వి.లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్సు రిపేరు చేసుకుంటూ వున్న వూళ్ళోనే నెలకు పదివేలు సంపాయించడం లేదా? చదువు ఒక్కటే కాదురా! తెలివితేటలు, లౌక్యం వుంటే ఏ రంగంలోనైనా, ఏ పనిలోనైనా బోలెడు సంపాయించుకోవచ్చు. ప్రపంచంలో ఒక్క ఎంసెటే వున్నట్టు - ఎంసెట్ భూతం పిల్లల్ని మానసికంగా హింసించడం-ఎంసెట్ సీటు రాకపోతే తెలివితక్కువ వాడనుకోవడం మూర్ఖత్వం. ఎంసెట్టే గీటురాయి అయితే దీని టాప్ ర్యాంకర్లు ఆ తర్వాత అయ్యేయస్, గ్రూప్ వన్‌ల్లో ఎందుకు వెల్లికలా పడుతున్నారు?".

రాజయ్య చెప్తున్నదాన్లో వాస్తవం వున్నట్టు గ్రహించాడు రాములు. "నువ్వన్నది నిజమే కానీ..." అంటూ నవ్వుతూ రాజయ్య కళ్ళల్లోకి చూశాడు రాములు. రాజయ్య మరింత ఉత్సాహంతో మళ్ళీ అందుకున్నాడు.

"కానీ ఏంది! నువ్వే చెప్పు ఈ అధికారులు, నాయకులు, పారిశ్రామికవేత్తలు, భూస్వాములు మనకున్న తెలివితో పోల్చితే ఏపాటిది వాళ్ళ తెలివి. అత్తెసరు మార్కుల్తోటి అదీ నకలు కొట్టి గజినీ దండయాత్రల్లా వాయిదాల పద్ధతిలో పాసైనోళ్ళు మన మీద పెత్తనం చేస్తున్నారు. మన కార్మికులు, కర్షకులు కష్టపడి సృష్టించే సంపదల్లో అధికభాగం మెక్కి తింటున్నారు. నువ్వన్నట్టు వాళ్ళకున్న కులం, దర్పం, ఆస్తిపాస్తులు పైరవీ మనకున్నాయా? వాళ్ళకు మనకు మధ్యన పోలిక ఎక్కడ? పోటీ ఎక్కడ? సమాన పరిస్థితుల్లో, సమాన పోటీని పోటీలంటారు. ఇది సమాన పోటీయేనా! ఎంసెట్‌లో ర్యాంకుల కోసం ఏటా 30, 40 వేలు పెట్టి నెల్లూరుకో, గుంటూరుకో, విజయవాడకో, హైదరాబాదుకో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు మనం మన పిల్లల్ని పంపడం సాధ్యమేనా! మన చిన్నప్పటిలాగా ఇపుడు కూలిపని చేసుకుంటూ గుడిసెలో గుడ్డి దీపం కింద చదువుకునే పేద పిల్లలకు ఈ ఎంసెట్ ర్యాంకు సాధ్యమా? ఏం పోటీ ఇది?".

"నిజమేరా! ఏటా 30, 40 వేలు పెట్టి 2, 3 ఏండ్లు లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించడం మనలాంటోళ్ళతో ఎక్కడవుతుంది? అట్లా కోచింగ్‌కు పోయినోళ్ళతో మన పిల్లలు పోటీ పడి సీటు

సంపాదించడం కష్టం అన్నావు - ఈ మాటను ఒప్పుకుంటాను."

"ఒప్పుకుంటావు గద! నీకు తెల్సా! అరవై వేల మంది దాకా ఈ ఎంసెట్ కోచింగ్‌లకు పోతున్నారు. కోచింగ్ సెంటర్లను బతికించడానికి తప్ప అరవై వేల మందికి సీట్లయితే రావు గదా! తల్లిదండ్రుల ఆశను వాళ్లు ఎన్‌క్యాష్ చేసుకుంటూ లక్షలు సంపాయిస్తున్నారు. ఎన్నో కోచింగ్ సెంటర్లు పేరు గొప్ప, ఊరు దిబ్బ. తిండి సరిగ్గా లేక, స్టాఫ్ సరిగ్గా లేక సౌకర్యాలు సరిగ్గా లేక రంధితో పాసయ్యేవాళ్ళు కూడా ఫేలవుతున్నారు. నువ్వు ఎన్ని చెప్పురా! ఈ పోటీ ప్రపంచంలో పైసలతో పెట్టుబడి పెట్టి "ప్రతిభ"ను పోటీపడి కొనుక్కోవడం మనలాంటోళ్ళతో కాదు. ఇట్లా చదువుకు పది లక్షలు ఖర్చుపెడితే ఇరవై లక్షలు కట్నం వస్తుందనుకునే వాళ్ళతో మనం ఎట్లా పోటీపడగలం. ఇరవై లక్షలు ఖర్చు పెడితే యాభై లక్షలు సంపాయించవచ్చు ననుకుని పోటీపడి అధికారాన్ని కొనుక్కునే ఎమ్మెల్యేలతో నీవూ నేనూ పోటీపడితే ఎలా గెలవగలం? మనకా ఆర్థిక స్తోమత లేదు."

"ఇపుడు కరెక్టు చెప్పినవురా! లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపిస్తే శేఖర్‌కు కూడా సీటు గ్యారంటీ - కానీ మనకా స్తోమత లేకపోయే" ఆవేదన చెందాడు రాములు.

"అలా ఏం కాదు. నా కొడుకు ఏ కోచింగ్‌కు పోకుండా సాధించుకోలేదా? శ్రద్ధ, ఆసక్తి, ఆత్మవిశ్వాసం అన్నిటికన్నా ముఖ్యం. ఇవి ఎట్లా ఏర్పడతాయనేది వేరే విషయం. మీ వోనికి ఎంసెట్ మీద ఆసక్తి లేదు. నిన్న వాడు నాతో స్పష్టంగా చెప్పాడు."

"మరి వాని భవిష్యత్తు ఎట్లారా?" మళ్ళీ రంధిలో పడ్డాడు రాములు.

లలిత కలుగజేసుకొని అంది. "ఏందన్నయ్యా! శేఖర్ ఏమన్న ఆడపిల్లనా! ఈడు పెరిగితే పిలగాడు దొరుకడన్నట్టు బాధపడవడితివి. శేఖర్ ఏది చదివినా చదివినంత దూరం చదివించు. ఏ ఉద్యోగం దొరకకపోతే ఓ స్కూలు పెడ్తడు. ఓ పత్రిక నడుపుకుంటడు. లేకపోతే మీ రో పది మంది కూడి ఓ ఫైనాన్సు పెడ్తే శేఖరును మేనేజరు చెయ్యవచ్చు. ఏదీ చేసినా మనకన్నా మంచిగ బతుకుతడు. ఎందుకు గంత రంధి పెట్టుకుంటవే."

"అంతే అయితది కావచ్చు. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలె గద."

రాజయ్య నవ్వుతూ చల్లగా చెప్పాడు. "ఎమ్మెస్సీ చేసి గ్రూప్ వన్, గ్రూప్ టూ పరీక్షలు పాస్ కాకపోతే ఎంఫిల్, పిహెచ్‌డి. చేసి లెక్చరర్‌నైనా అవుతాను మామయ్య అంటూ శేఖర్ నిన్న నాతో ఛాలెంజీగా అన్నాడురా! వాడన్నది సాధించి తీరుతాడు. వానికి ఇంటర్‌లో తక్కువ మార్కులు వచ్చాయని బాధపడనవసరం లేదు. ఇంటర్ దాకా ఎవరేజీగా వున్నవాళ్ళు ఆ తర్వాత గొప్పగా ముందుకు దూసుకుపోయిన వాళ్ళెంతో మంది వున్నారు. నన్నే తీసుకోరాదు. పదో తరగతిలో సెకండ్ క్లాసు. ఎం.ఎ.లో గోల్డుమెడల్ రాలేదా?"

శేఖర్ ఆసక్తి విని రాములు తేరుకున్నాడు. లోలోపల కొంచెం సంతోషం కూడా కలిగింది. అయినా "వాడు చూడూ-నీకు చెప్పిండు గాని నాకు చెప్పకపోయె" నిష్ఠురపోయాడు.

"నాన్నకు చెప్పినా నమ్మడు మామయ్యా! ఎంసెట్ రాలేదు గాని ఏదేదో అవుతావా అని తీసిపారేస్తాడు అని బాధపడ్తూ చెప్పాడు వాడు" రాజయ్య అసలు విషయం చెప్పాడు.

"వాని యిష్టం..... ఎలా వుంటే అలాగే కానీ! మనం చేసేదేమున్నది రా! ఆశ, ఆసక్తే గదా మనిషిని ఎదిగించేది" అన్నాడు రాములు.

"అరేయి వానికి కూడా జీవితం పట్ల, భవిష్యత్తు పట్ల గొప్ప ఆశలు, ఆశయాలున్నాయి. వాన్నింకా నీవు చిన్న పిల్లాడిలా చూడ్డం వల్ల వాడి ఆలోచనలు నీకందడం లేదు. వాడు నీతో మనస్సు విప్పి చెప్పడం లేదు. వానికి గొప్ప ఆదర్శాలున్నాయి. బాగా చదువుకోవాలి. సమాజానికి గొప్ప సేవ చేయాలి. కులాంతర వివాహం చేసికోవాలి. భార్యాభర్తలు యిద్దరూ ఉద్యోగాలు చేయాలి. చక్కని

రచయితనవ్వాలి. లేదా ఉద్యోగం చేస్తూనే పదిమందితో కల్సి ఒక మంచి ఇండస్ట్రీ పెట్టాలి వంటి ఎన్నో చక్కని ఆశయాలున్నపుడు నీవు తిట్టడం, కొట్టడం బాగుండదు. వాని భవిష్యత్తును వాడు తీర్చి దిద్దుకునేందుకు మనం సహకరించాలి, ప్రోత్సహించాలి. నీ అభిరుచే మా అభిరుచి - కావల్సిందల్లా నీవు బాగా ఎదగడం అని భరోసా ఇవ్వడం, చనువు పెంచుకోవడం మన కర్తవ్యం - అంతే."

"ఈ సినిమాలు షికార్లు ఏంటిదిరా మరి?"

"మనకు లేని సుఖాలు వాళ్ళకున్నాయి. మనలాగా వాళ్ళనూ కష్టపడుమని అనలేం కదా! నువ్వన్నట్టు సైన్సు, టెక్నాలజీ సంపద ఎంతో అభివృద్ధి అయింది. అందువల్ల అవి కామన్. మనం చిన్నప్పుడు ఒక గంట కోసం సైకిల్ అడిగితే ఇవ్వలేదు. కిరాయికి తెచ్చుకో. ఆ కిరాయి నేనిస్తానన్నారు. అప్పుడు సైకిలే అపురూపం. ఇపుడు గంటలకొద్దీ స్కూటరు కూడా అడగ్గానే ఇస్తున్నారు స్నేహితులకు. మన మెదడు ఇంతకు ఇంకా పది రెట్లు శక్తివంతమైంది. పిల్లల్లో అదింకా వికసిస్తోంది. సిన్మాలు చూస్తేనో, క్రికెట్ ఆడితేనో వాళ్ళకు ఇక చదువు మీద శ్రద్ధ లేదని మనం భావించకూడదు. బాధపడకూడదదు. వాళ్ళను బాధపెట్టకూడదు. నీకు తెల్సా నీ కొడుకు 2, 3 కథలు, కవితలు కూడా రాశాడు. నాకు చూపాడు. నీకు చూపాడా? నువ్వా చనువు ఇచ్చావా?" నిలదీశాడు రాజయ్య.

"ఇక జీవితంలో వాన్ని ఎన్నడూ కొట్టనురా" సీరియస్‌గా అన్నాడు రాములు.

"అలా అనడం ఇది ఎన్నోసారే అన్నయ్యా!" అంటూ నవ్వింది లలిత.

"నా కొడుకు గొప్పవాడు కావాలి. గొప్ప ఆశయాలున్న రచయితను కొట్టిన తండ్రి అన్పించుకోను లలితా" కుర్చీలో అలాగే ఒరిగి కళ్ళుమూసుకుని తన కొడుకును చక్కని రచయితగా, డిగ్రీ లెక్చరర్‌గా, ఇండస్ట్రియలిస్టుగా, పత్రికా సంపాదకునిగా పలు రూపాల్లో ఊహిస్తూ ఆశగా తనలో తాను తన్మయత్వం చెందుతున్నాడు రాములు. రాములుకు తన కొడుకు భవిష్యత్తు మీదున్న భయం తీరిపోయింది.

*21-28 మే 1995,*
*ఆదివారం ఆంధ్రజ్యోతి.*
*(రచనాకాలం : మే '95)*